andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6। కనిష్ఠం 24.2
నిర్మల్
జిల్లా వార్తలు
8
బుధవారం 17 జూలై 2024







ఆలయ భూముల ఆక్రమణ

» జిల్లాలో 86 ఎకరాల భూములు కబ్జాకు గురైనట్లు గుర్తింపు » ఎండోమెంట్ ఆధ్వర్యంలో ఇప్పటికే పూర్తయిన స్పెషల్ డ్రైవ్
» కబ్జాదారులపై చర్యలకు సిఫారసు » కబ్జాలపై రాష్ట్ర సర్కారు ప్రత్యేక దృష్టి

నిర్మల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలం నుంచి జిల్లాలోని విలువైన దేవాదాయశాఖ భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు సంబంధితశాఖ ఆలస్యంగా గుర్తించింది. రాజకీయ పలుకుబడి, పరపతి గల వ్యక్తులు కొంతమంది ఈ భూములను పథకం ప్రకారం కబ్జా చేశారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు 86.28 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఆక్రమణకు గురైనట్లు సంబంధిత అధికారులు నిర్ధారించారు. అయితే దీనికి నాలుగింతలుగా భూములు ఆక్రమణకు గురయ్యాయన్న ఫిర్యాదులున్నాయి. జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో మొత్తం 72 ఆలయాలున్నాయి. ఈ ఆలయాల పరిధిలో దాదాపు 1381.07 ఎకరాల భూములున్నట్లు దేవాదాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ భూములకు సంబంధించిన రికార్డులు మాత్రం తమ వద్ద అందుబాటులో ఉన్నాయని వివరిస్తున్నారు. అయితే అధికారులు చెబుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులు చెబుతున్న లెక్కలకు నాలుగింతల భూములు దేవాదాయశాఖ పరిధిలో ఉండేవని, అందులో నుంచి పెద్దమొత్తంలో భూములు ఆక్రమణలకు గురయ్యాయన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం 1081.09 ఎకరాల భూములు సంబంధిత ఆలయాల అర్చకుల పరిధిలో ఉండగా మరో 53.12 ఎకరాల భూములను అధికారికంగా లీజుకు ఇచ్చారు. 59.12 ఎకరాల భూములు ప్రస్తుతం దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్నాయి. దేవాదాయశాఖ అధికారులు చెబుతున్న లెక్కలపై భిన్నాభిప్రాయాలు వెలువడడంతో సంబందితశాఖ ఉన్నతాధికారులు ఈ దిశగా సీరియస్‌గా దృష్టి కేంద్రీకరించారు. వెంటనే జిల్లాలోని దేవాదాయశాఖ భూములన్నింటిని రీసర్వే చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో దేవాదాయశాఖ అధికారులంతా ఉరుకులు పరుగుల మీద స్పెషల్ డ్రైవ్ పేరిట రీసర్వేకు ఉపక్రమించారు. ఇప్పటికే స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం పూర్తి చేశారు. తమ వద్ద ఉన్న రికార్డులతో పాటు రెవెన్యూ రికార్డులను పరిగణలోకి తీసుకొని ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా భూముల అసలు లెక్కలను నిర్ధారించాల్సిన అవసరం ఉందంటున్నారు. అలాగే ఈ ఆక్రమణకు గురైన భూములను గుర్తించి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో సంబంధిత శాఖ అధికారులు రంగంలోకి దిగి వాస్తవాలను వెలుగులోకి తేబోతున్నారు. అయితే ఆ ఆక్రమణల్లో పలువురు రాజకీయ నేతల హస్తం ఉన్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు స్పెషల్ డ్రైవ్ నివేదికపై ఎలాంటి చర్యలు ఉండబోతాయోననే అంశంపై ఆసక్తి నెలకొంటోంది.

నేతల అండదండలతోనే..

జిల్లాలోని దేవాదాయశాఖ భూముల కబ్జాల వెనక రాజకీయ పార్టీల నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. నేతల అండదండలతోనే ఈ కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగిందని చెబుతున్నారు. రాజకీయనేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న కొంతమంది అధికారుల నిర్వాహకం కారణంగా ఈ తతంగం దర్జాగా కొనసాగుతుందని చెబుతున్నారు. దేవాదాయశాఖలో పర్యవేక్షణ లోపం కూడా ఆక్రమణదారులకు కలిసివస్తుందని పేర్కొంటున్నారు. భూములపై సరియైన నిఘా పర్యవేక్షణ లేకపోవడం కబ్జాదారులకు వరంగా మారిందని అంటున్నారు. ఇప్పటికే చాలాసార్లు ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినప్పటికీ తూతూమంత్రంగా విచారణలు చేయడం ఆ తరువాత ఆ విచారణ నివేదికలు బుట్టదాఖలు కావడం రివాజుగా మారిందని అంటున్నారు. సంబందిత శాఖ అధికారుల నిర్లక్ష్యం, నిర్వాహకం కారణంగానే ఈ ఆక్రమణల పర్వం అడ్డూ అదుపు లేకుండా సాగిందన్న వాదనలు ఉన్నాయి.

రికార్డులు సైతం తారుమారు..

కాగా దేవాదాయశాఖ కోట్ల రూపాయల విలువైన భూములకు సంబంధించిన రికార్డులను కబ్జాదారులు వ్యూహాత్మకంగా తారుమారు చేశారని అంటున్నారు. దేవాదాయశాఖ పరిధిలో ఉన్న రికార్డులను మాయం చేసి ఆ రికార్డులు అందుబాటులో లేకుండా చేశారన్న వాదనలున్నాయి. ఇప్పటి వరకు దేవాదాయశాఖ వద్ద భూములకు సంబంధించిన ఖచ్చితమైన రికార్డులు అందుబాటులో లేకపోవడం ఆక్రమణదారుల కబ్జాలకు ఆస్కారమిచ్చిందని అంటున్నారు. దేవాదాయశాఖ రికార్డులే కాకుండా ఈ ఆక్రమణదారులు తమకున్న పలుకుబడి, పరపతితో రెవెన్యూ రికార్డులను సైతం తారుమారు చేసి తమకు అనుకూలంగా మలుచుకున్నారని అంటున్నారు. రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఉన్న రికార్డుల ఆధారంగానే భూముల లెక్కలను నిర్ధారిస్తున్నారంటున్నారు.

భూముల ఆక్రమణలపై కొత్త సర్కారు సీరియస్..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన దేవాదాయ శాఖ భూముల లెక్కలను తేల్చేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుం బిగిందని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న రికార్డులతో పాటు పాత రికార్డులను సైతం తిరగదోడే ప్రయత్నం మొదలైందని అంటున్నారు. గత కొద్ది రోజుల క్రితం జరిపిన సర్వే లెక్కల ఆధారంగా మొత్తం భూముల గుట్టును రట్టు చేసే ప్రయత్నాలు మొదలుకానున్నాయని అంటున్నారు. ఇప్పటికే దేవాదాయ శాఖ నుంచి సంబంధిత అధికారులకు భూములకు సంబందించిన స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయని చెబుతున్నారు. అప్పటి రాజకీయ నేతల అక్రమాలను ఎండగట్టే క్రమంలో మరోసారి కూడా పకడ్బందీగా రీ సర్వే చేపట్టాలన్న అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి కొత్త ప్రభుత్వం దేవాదాయశాఖ ఆక్రమణలపై కఠినచర్యలు తీసుకోబోతోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.



నేడు తొలి ఏకాదశి



శేషతల్పం మీద నిద్రిస్తున్న విష్ణువు

ముథోల్, జూలై 16 : నేడు తొలి ఏకాదశి. దీన్ని హిందువులు తొలి పండుగగా పిలుస్తారు. తొలి ఏకాదశి పర్వదినానికి హైందవ సంస్కృతిలో విశేష స్థానం ఉంది. ఒక ఏడాదిలో వచ్చే 24 ఏకాదశిలో ఆషాడ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. దీనికి శయన ఏకాదశి అని, హరి వాసరమని పేర్లు ఉన్నాయి. పురాణాలను అనుసరించి శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పం మీద శయనిస్తాడు. అలా నాలుగు నెలల పాటు ఆయన పడుకొని ప్రబోధిని ఏకాదశి నాడు తిరిగి మేల్కొంటాడు. ఈ నాలుగు నెలలను చతుర్మాసాలుగా వివరిస్తారు. ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు చతుర్మాస దీక్షను ఆచరిస్తారు. ఉత్తరాయణం కంటే దక్షిణాయనంలో పండుగలు, పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా వస్తాయి. కనుక ఈ కాలంలో ఆరోగ్య పరిరక్షణ నియమాలు ఆచరించాలి. అందువల్ల మన పెద్దలు వ్రతాలు, పూజలు, ఉపవాసాలు ఆచరించాలని చెబుతారు.

ఏకాదశి తిథి

కృతయుగంలో మురాసురుడనే రాక్షసుడు బ్రహ్మవరంతో దేవతలను, ఋషులను హింసించడంతో శ్రీ మహావిష్ణువు అతనితో పోరాడి అలసిపోయి గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా శ్రీహరి శరీరం నుండి ఓ కన్య ఆవిర్భవించి రాక్షసుడిని అంతం చేసిందట, ఇందుకు సంతోషించిన మహావిష్ణువు కన్యను వరం కోరుకోమనగా తాను విష్ణుప్రియగా లోకం చేత పూజించబడాలని కోరుతుందట అప్పటి నుంచి ఏకాదశి తిథిగా వ్యవహారంలోకి వచ్చింది. ఈ రోజు ఉపవాస దీక్షబూని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. గ్రామాల్లోని స్థానిక ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

ఏకాదశికి ఆలయాల ముస్తాబు



భైంసాలో ముస్తాబైన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం

భైంసా, జూలై 16 ; తెలుగు వారికి పండుగలు, సంప్రదాయాలు ముఖ్యమైనవి. సంవత్సరం పొడవునా జరుపుకునే పండుగలు బుధవారం వచ్చే ఏకాదశి నుంచి ప్రారంభం కానున్నాయి. తెలుగు సంవత్సరాది ప్రకారం ఏటా ఆషాఢమాసంలో 11వ రోజును ఆషాఢశుద్ధ ఏకాదశిగా భావిస్తారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పేద, ధనిక తేడా లేకుండా బుధవారం ఏకాదశిని జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. పండుగ సందర్భంగా ఉపవాసదీక్ష చేపట్టనున్నారు. దేవాలయాలను కూడా ముస్తాబు చేశారు. పరమ పవిత్రంగా జరుపుకునే ఏకాదశి రోజునే పండరీపూర్ పల్లకి యాత్ర మొదలవుతుంది. ఇక్కడి జిల్లా ప్రజలకు పండరీపూర్‌తో అనుబంధం ఉండడంతో పల్లకి యాత్రలో భాగస్వాములవుతారు.

● ఉపవాసం.. ప్రత్యేకం

ఏకాదశి వ్రతంలో ముఖ్యమైంది ఉపవాసం. ఆషాఢమాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా జరుపుకుంటారు. ప్రత్యేకదైవంగా చెప్పుకునే సూర్యుడు దక్షిణం వైపునకు మారినట్లు దక్షణాయన ప్రారంభాన్ని సూచిస్తుంది. అసలు పంచాంగంలో నెలకు రెండు చొప్పున 24 ఏకాదశిలు వస్తాయి. తొలి ఏకాదశి, ముక్కోటి ఏకాదశిని ఎంతో విశిష్టంగా జరుపుకుంటారు. ఏకాదశి రోజు వ్రతాన్ని ఆచరిస్తే వైకుంఠప్రాప్తి లభిస్తుందని చెప్పుకుంటారు. ఈ ఆషాఢమాసంలోనే చంద్రుడి శక్తి సంపూర్ణంగా ఉండే రోజు ఆషాఢపూర్ణిమ, ఈ పూర్ణిమను గురు పూర్ణిమగా లెక్కిస్తారు. ఆషాఢమాసంలో ధార్మిక కార్యక్రమాలు మాత్రమే జరపాలని, ఏ శుభకార్యాలైనా చేయడం సరికాదని భావిస్తారు.

● ఏకాదశి వ్రత మహత్యం...

పవిత్ర ఆధ్యాత్మిక ముక్తి ప్రద దినం తొలి ఏకాదశి. దీనికే హరి దినమని మరో పేరు ఉంది. ఏకాదశి వ్రతంలో ఉన్న విశిష్టత పద్మపురాణం చదివితే తెలుస్తుంది. వ్రతాన్ని ఆచరించేవారు ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందుగానే స్నానం చేసి శ్రీహరిని పూజించాలి. ఆ రోజు మొత్తం ఉపవాసం ఉండాలి.

సీఎం సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష



సీఎం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జూలై 16 : సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. జిల్లాల కలెక్టర్లతో సీఎం సమావేశం ఏర్పాటు చేశారు.

పట్టణంలో గోరింటాకు సంబురాలు



గోరింటాకు సంబురాలు జరుపుకుంటున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జూలై 16 : ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆదర్శనగర్‌లో గల జేబీ సునందిని అపార్ట్‌మెంట్‌లో మంగళవారం గోరింటాకు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కాగా మార్కెట్‌లో దొరికే ఆర్టిఫిషియల్ రంగులతో కాకుండా, అటవీప్రాంతం నుంచి తీసుకొచ్చిన సహజసిద్ధమైన గోరింటాకులను ముద్దలా చేసి మహిళలందరూ ఒకరినొకరు పెట్టుకొని ఆత్మీయతను పంచుకోవడం ఈ ఆషాడ మాసంలో శుభ సూచకమని చెబుతుంటారు. ఈ సంబరాల్లో అపార్ట్‌మెంట్ మహిళలందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేటి నుంచి ఇథనాల్ పరిశ్రమకు

వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు

దిలావర్‌పూర్, జూలై 16 : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు దిలావర్‌పూర్ ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి నిర్ణయించింది. మంగళవారం దిలావర్‌పూర్ పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో గ్రామస్తులు సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతామని ప్రకటించారు. ఉమ్మడి మండలంలోని గ్రామాల్లో ఇథనాల్ పరిశ్రమ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉద్యమంలో భాగస్వాములు కావడం ద్వారా భవిష్యత్ తరాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

ఇథనాల్ పరిశ్రమతో కలిగే ప్రయోజనాలపై వెలసిన పోస్టర్లు



దిలావర్‌పూర్, జూలై 16 : ఇథనాల్ పరిశ్రమ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ దిలావర్‌పూర్‌లో వెలసిన పోస్టర్లు చర్చనీయాంశమయ్యాయి. దిలావర్‌పూర్ బస్టాండ్‌లో ఈ వాల్‌పోస్టర్లు వేశారు. ఇటు ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి అటు ఇథ నాల్ యాజమాన్యం తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తుండడం పట్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి ఇథనాల్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ మండలంలో పోస్టర్లు వేసేందుకు సిద్ధమవుతోంది. నువ్వా... నేనా అన్నట్లు సాగుతున్న పోరాటం ఎటు తిరిగి ఎటు దారి తీస్తుందోనన్న ఆందోళన వ్యక్త మవుతోంది.

భారీ వర్ష హెచ్చరికలతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం

● వరద ప్రమాద నివారణ కోసం ముందస్తు చర్యలు ● నష్ట నివారణ చర్యలపై ఆర్టీసీ, విద్యుత్, మున్సిపల్ అధికారుల సమీక్ష



డిపో అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్‌కుమార్



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్

భైంసా, జూలై 16: రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో భైంసా డివిజన్ అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా భారీ వర్షాలు వస్తే వచ్చే వరదల వల్ల ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు గాను ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోంది. గత యేడు భారీ వర్షాల మూలంగా ఇక్కడి గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి అధిక మొత్తంలో వరద నీరు వచ్చి చేరడం, స్వల్ప వ్యవధిలోనే ఆరు వరద గేట్లు ఎత్తి లక్షకు పైగా క్యూసెక్కుల నీటిని సుద్దవాగులోకి వదిలిపెట్టడం జరిగింది. దీంతో సుద్దవాగు పరివాహక ప్రాంతాలతో పాటు భైంసా పట్టణ పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. నివాస గృహాల్లోకి వదర నీరు రావడంతో పలు ప్రాంతాలవాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం గడిపారు. జాలర్లు, ఫైర్, పోలీసులు ప్రాణాలకు తెగించి వరద నీటిలో చిక్కుకున్న వారిని కాపాడారు. బస్సు డిపోలో వరద నీరు వచ్చి చేరడంతో డిపోలోని బస్సులు ముప్పాతిక భాగం నీట మునిగాయి. వరద నీటిలో పలువురు ఆర్టీసీ సిబ్బంది చిక్కుకపోగా పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో వారందరిని సురక్షితంగా బయటకు తీసుకవచ్చారు. డిపోను వరద నీరు ముంచెత్తడంతో ఆర్టీసీకి అపార నష్టం వాటిల్లింది.ఇక సుద్దవాగు వరద ఉధృతితో పాతికకు పైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఈ దఫా అలాంటి కష్టనష్టాలు ఏవి తలెత్తకుండా ఉండేందుకు గాను ఆయా ప్రభుత్వశాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ట్రాన్స్‌కో అధికారులు వరదలతో సమస్యలు ఏర్పడితే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లుగా తెలిసింది. ఇక ఆర్టీసీ అధికారులు గత సంవత్సరం చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో అప్రమత్తమయ్యింది. మంగళవారం ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ప్రణీత్‌కుమార్ భైంసాకు వచ్చి ఇక్కడి డిపో నిర్వాహణాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టును సందర్శించి అక్కడి అధికారులతో తాజా పరిస్థితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక మున్సిపల్ ఇన్‌చార్జీ కమిషనర్ సీహెచ్ సుదర్శన్‌రెడ్డి అధికారులు, సిబ్బందితో వరద ప్రమాదాలు, నష్టనివారణ చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ముంపు బారిన పడే ప్రాంతాలవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేకాకుండా స్థానిక నర్సింహకల్యాణ మండపంలో ముంపు బాధితుల కోసం పునరావస శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు అధికారులు సైతం తాజా పరిస్థితులు, భారీ వర్షాలతో వచ్చే అధికమొత్తంలో వరద నీరు వచ్చి చేరితే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లుగా తెలిసింది. వాతావరణ శాఖ హెచ్చరికలు, గత సంవత్సరం భారీ వర్షాలతో చోటు చేసుకున్న ఘటనలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ శాఖల అధికారులు అన్నివేళలా అందుబాటులో ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లుగా సమాచారం. ఇందుకు అనుగుణంగానే ఇక్కడి అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

రౌడీషీటర్లు తీరుమార్చుకోకపోతే పీడీయాక్టు

● భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, జూలై 16 : పట్టణ పరిధిలోని రౌడీషీటర్లు క్రిమినల్ తీరును మార్చుకోకపోతే పీడీ యాక్టు కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణ పరిధిలోని రౌడీషీటర్లకు రాబోయే పర్వదిన వేడుకలను పురస్కరించుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని వెల్లడించారు. రౌడీషీటర్లు అల్లర్లకు పాల్పడే విధానాలను, మతకలహాల సృష్టించే ధోరణులను, ఘర్షణలు, గొడవలు, కొట్లాటలకు దిగడం లాంటి క్రిమినల్ చర్యలను విడనాడాలని హితవు పలికారు. అల్లర్లు, కలహాలకు దూరంగా ఉంటూ సత్‌పరివర్తనతో మెలిగే వారి వివరాలను ఉన్నతాధికారులకు సిపారసు చేసి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటానని పెర్కొన్నారు. క్రిమినల్ దోరణులతో వ్యవహరిస్తే పీడీ యాక్టు బారిన పడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రౌడీ షీటర్ల ప్రతీ కదలికపై నిరంతర నిఘా ఉంటుందని వివరించారు. ఇందులో టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ గౌష్ పాషాలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు

వైద్యుల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ధనరాజ్

నిర్మల్ కల్చరల్, జూలై 16 : హెచ్ఐవీ బాధితులకు మెరుగైన సేవలందిస్తున్న జిల్లాలోని వైద్యాధికారులను జిల్లా వైద్యాధికారి ధనరాజ్ అభినందించారు. మంగళవారం ప్రసూతి ఆసుపత్రిలో నర్సింగ్ అధికారులు, వైద్యాధి కారులను సన్మానించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా మనోధైర్యం కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఐసీటీసీ కృషి చేయాలన్నారు. డాక్టర్ ప్రమోద్‌రెడ్డి, సమత, విన్నీ, జమున, నళిని, సింధూజ, అరుణ్‌రెడ్డి, గణేష్, తదితరులు సన్మానం పొందిన వారిలో ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బ్రిడ్జిపై లారీ ప్రమాదం..

తృటిలో తప్పిన ప్రాణాపాయం



బ్రిడ్జి రెయిలింగ్ పైకి ఎక్కిన లారీ

నిర్మల్ రూరల్, జూలై 16 : నిర్మల్ మండలం చిట్యాల వాగుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ ఆ ప్రమాదం నుండి తృటిలో తప్పించుకుంది. భైంసా వైపు నుండి నిర్మల్ వైపు వస్తున్న ఈ లారీ అదుపు తప్పి చిట్యాల బ్రిడ్జిని ఢీకొని దానిపై సగం వరకు వచ్చి ఆగిపోయింది. దీంతో లారీ ముందు భాగమంతా ధ్వంసమైంది. మరికొంత భాగం బ్రిడ్జి వాల్ పైకి లారీ వచ్చి ఉన్నట్లయితే వాగులో పడిపోయేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా లారీని నడుపుతున్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం కారణంగా భైంసా, నిర్మల్ రహదారిపై రాకపోకలకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య



రామ్‌కుమార్ మృతదేహం

భైంసా రూరల్, జూలై 16 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన కొండ్రు రామ్ కుమార్(26) ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వానల్‌పాడ్ గ్రామానికి చెందిన కొండ్రు రామ్ కుమార్ గత కొద్ది రోజుల నుంచి మానసిక స్థితి బాగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శ్యామల పిటిషన్ మేరకు దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఏఎస్సై మారుతి తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ముథోల్, జూలై 16 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన కండెల సాయినాథ్ అనే రైతుకు చెందిన గేదె సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం... గేదె సోమవారం అడవిలో మేసి తిరిగి ఇంటికి రాగా.. గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మృతి చెందింది.



గేదె కళేబరం


నీరు లేక వెలవెలబోతున్న మొగిలి చెరువు

నిండని చెరువులు.. నీరసిస్తున్న రైతులు!

ఉట్నూర్, జూలై16: వర్షాకాలం ప్రారంభమై నెల 15రోజులు దాటుతున్నా సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో చెరువులో నీళ్లు నిండక రైతులు నిరసించి పోతున్నారు. ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి, బీర్సాయిపేట, గన్‌పూర్ ప్రాంతాలతో పాటు గోపాయి చెరువు, గంగన్నపేట, ఎల్లమ్మ చెరువు, సరస్వతి చెరువులలో ఇంకా వర్షపు నీరురాక పోవడంతో వరి ధాన్యం పండించే రైతులు వరి నాట్లు వేయడానికి చెరువులు నిండడం లేదని వాపోతున్నారు.ఉట్నూర్ మండలంలోని దంనపల్లి, బీర్సాయిపేట, గంగన్నపేట, లక్కారం, ఉట్నూర్, పాత ఉట్నూర్ ప్రాంతాల కొంత మంది రైతులు మాత్రమే ప్రతియేటా చెరువుల కింద రెండు పంటలు ఆసగు చేస్తూ వరి ధాన్యం పండిస్తున్నారు. వరి నాట్లు వేయడానికి పంట భూములు సిద్ధం చేసుకుని నారుమళ్లు అలకడానికి నారు కూడా సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు కురిస్తే వరినాట్లు వేయాలని చూస్తున్న రైతులకు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో వర్షాలు కురిసి సమృద్ధిగా చెరువులు నిండుతాయని భావిస్తున్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు అందేదెలా !?


కాటా(బి) సమీపంలోని పిచ్చి మొక్కలతో నిండిన కాల్వ

బోథ్, జూలై16: మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు కింద ఉన్న భూములకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కాల్వలు పూర్తిస్థాయిలో సాగు నీరు అందించలేకపోతున్నాయి. సకాలంలో పంటలకు సాగునీరు చివరిఆయకట్టు రైతులకు అందడంలేదు. కాలువలకు మధ్యలో కొంతమంది రైతులు గండి కొట్టడంతోపాటు కాల్వలకు అడ్డంగా పెద్ద బండరాళ్లను పెట్టి సాగునీరు అందకుండా చేయడంతో కాలువలో చెత్తాచెదారం నిండుతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు రబీకి ముందే కాల్వలో పేరుకున్న చెత్తను తొలగించడంతోపాటు ఆయకట్టు రైతులతో కమిటీలను ఏర్పాటుచేసి రైతులందరికీ సాగునీరందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

'పంట సాగు చేసే ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలి'

తలమడుగు, జూలై 16: పంట సాగు చేసే ప్రతీ రైతుకు రైతుకు రైతు రుణమాఫీ, రైతుభరోసా అందించాలని మంగళవారం తహసీల్దార్ రాజ మోహన్‌కు రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వం రేషన్ కార్డులే ఇవ్వలేదని, అలాంటిది రేషన్‌కార్డు ప్రతిపాదికన కుటుంబాలను గుర్తించడం అనేది సరైన పద్ధతి కాదని బ్యాంకుల్లో పంటరుణం తీసుకున్న ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ జరగాలని అన్నారు. ప్రతీ రైతుకు రైతుభరోసా డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు : ఎస్సై

బజార్‌హత్నూర్, జూలై16: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై నరేష్ హెచ్చరించారు. మండలంలోని బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన రైతులు ఎన్నోఏళ్ల నుంచి వ్యవసాయ పనుల కోసం వినియోగించుకుంటున్న దారిని కొందరు ధ్వంసం చేయడంతో బాధిత రైతులందరూ తహసీల్దార్ శంకర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 137, 138లో వ్యవసాయ పనుల కోసం ఎన్నో ఏళ్లుగా రైతులు దారిని వినియోగించుకుంటున్నామని, ఈ మధ్య పట్టేదారులు ఏరేకార్ సాయి, ఏరేకార్ నవీన్‌లు దారిని ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్ శంకర్ సంబంధిత పట్టేదార్లకు నోటీసులు జారీ చేయగా వారు ఆ నోటీసులను తీసుకునటకు నిరకరించారని, అక్కడి నుంచి దారిని ఏర్పాటుచేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని సదురు పట్టేదారులు బెదిరించినట్లు తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టేదారులు ఏరేకార్ సాయి, ఏరేకార్ నవీన్‌లపై కొత్త చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదుచేశామని ఎస్సై నరేష్ తెలిపారు. ప్రభుత్వ అధికారులపై బెదిరింపులకు పాల్పడినా, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

నేరడిగొండ, జూలై 16: రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీజేపీ నేరడిగొండ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం ఆయన నేరడిగొండలో మాట్లాడారు. రుణమాఫీ కోసం రైతులా కదా అని చూడాలని, రేషన్ కార్డు చూడటమేంటని ప్రశ్నించారు. పాస్‌బుక్ ఉన్న ప్రతీ రైతులందరికీ రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేసన్‌కార్డులు ఇవ్వక పోవడం ప్రభుత్వం తప్పని అన్నారు. ప్రభుత్వ నిబంధనలతో సగంరైతులకు రుణమాఫీ అందదనిచెప్పారు.గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి రైతులపట్ల చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, రాఘవులు, ప్రవీణ్, జిల్లా ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి రాములున్నారు.

టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మావల, జూలై16: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌ను పటేల్ రమేష్‌రెడ్డి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పటేల్ రమేష్‌రెడ్డిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్గుల మల్లేష్, ఉపాధ్యక్షులు తడ్సేన వెంకట్‌రెడ్డి, మావల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పటేల్ రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి


ముస్తాబైన లక్ష్మీపూర్ ఆలయం(ఇన్‌సెట్‌లో కొలువుదీరిన విగ్రహాలు)

నేడు విఠల్ రుకుంబాయి కల్యాణోత్సవం

జైనథ్, జూలై 16: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో గల అతిప్రాచీన విఠల్ రుకుంబాయి ఆలయంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఏకదశి సందర్భంగా బుధవారం విఠల్ రుకుంబాయి కల్యాణోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పూలతో పాటు వివిధ రంగులు గల విద్యుత్ మెర్క్యురి బల్బులతో ముస్తాబు చేశారు. పండరిపురం మాదిరిగా జరిగే విఠల్‌రుకుంబాయి కల్యాణోత్సవాన్ని లక్ష్మీపూర్ గ్రామంలో వేదపండితుల మధ్య కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. అభిషేకం నిత్యహోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి ఆయా గ్రామాల మహిళలు భక్తులు ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గ్రామప్రజలు కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

సరిపడా ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలి : డీఏవో

బజార్‌హత్నూర్, జూలై 16: మండలంలోని రైతులకు సరిపడా ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని డీఏవో పుల్లయ్య అన్నారు. మగళవారం మండలం పరిధిలోని పలు ఫర్టిలైజర్ శాపులను, వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల శాపులను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల నిల్వ అమ్మిన వాటి జాబితాను పరిశీలించారు. ప్రతీరోజు సాయంత్రం తర్వాత రోజువారిగా ఎరువుల నిల్వలు, అమ్మిన వివరాలను పొందు పర్చాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుకూలంగా అమ్మకాలు జరపాలన్నారు. యూరియా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ముందుగానే నిల్వ ఉంచుకోవాలని, రైతులకు సరిపడా ఎరువులు ఉండేవిధంగా చూడాలన్నారు. రైతులు అధిక మొత్తంలో పంటలకు రసాయన ఎరువులు వాడకూడదన్నారు. పంటలకు సరిపడా మోతాదులో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వినియోగించుకోవాలన్నారు. సహజ ఎరువులపై ఎక్కువ ఆధరపడుతూ సేంద్రియ పంటలను సాగు చేసే విధంగా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కూరగాయలు, టమాట, ఆకుకూరలకు ఎట్టి పరిస్థితుల్లో పురుగు మందులు వాడకూడదని, మనుషుల ఆరోగ్యంపై తీవ్రంగా హాని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌రెడ్డి, సహకార సంఘం సీఈవో నారాయణ గౌడ్, ఛైర్మన్ మేకల వెంకన్న, వ్యాపారస్థులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

● మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ● రుయ్యాడిలో హసన్ హుస్సేన్ పీరీలను దర్శించుకున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, తదితరులు

తలమడుగు, జూలై 16: మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండుగని, తెలంగాణ రాష్ట్రానికి రుయ్యాడి పీరీలని మాజీ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో రుయ్యాడి గ్రామంలో గల హసన్ హుస్సేన్ ఆలయంలో గల పీరీలను దర్శించుకున్నారు. అనంతరం ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని రుయ్యాడి గ్రామంలో చరిత్ర గల హసన్ హుస్సేన్ దేవస్థానం 150ఏళ్ల చరిత్ర ఉందన్నారు. మొహరం పండుగ మత సామరస్యానికి నిదర్శనం అన్నారు. వారం రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవడం అభినందనీయమన్నారు. వారం రోజుల పాటు గ్రామంలో మద్యపాన నిషేధం, కాళ్లకు చెప్పుల్లేకుండా ఉండటం భక్తికి నిదర్శనం అన్నారు. గ్రామస్థులు, భక్తుల సహకారంతో ఆలయం నిర్మించడం ఎంతో అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో హసన్ హుస్సేన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ, మండల కన్వీనర్ తోట వెంకటేష్, యువ నాయకులు అభిరాంరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు అబ్దుల్లా, ఎల్మా శ్రీనివాస్‌రెడ్డి, పోతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గంగాధర్, సతీష్‌రెడ్డి, బొజ్జ ప్రవీణ్, రాజు, నర్సింహులు, పొచ్చన్న, గజానంద్, రమాకాంత్, కౌడాల మహేందర్, రాజు, రాకేష్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా, మాజీ మంత్రి, రాజకీయ గురువు ఇంద్రకరణ్‌రెడ్డితో రుయాడి సవర్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

● భక్తులతో కిటకిటలాడుతున్న రుయ్యాడి

తలమడుగు: మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే మొహర్రం పండుగ ఉత్సవాలు.. పల్లెల్లో పీర్ల సందడి మొదలయ్యాయి. కుల, మత విభేదాలకు తావు లేకుండా ప్రతిఒక్కరూ జరుపుకుంటారు. వారం రోజుల పాటు జరుపుకుని ఈ పండుగ తెలంగాణ ప్రాంతం ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ జరుపుకుంటారు. ముఖ్యంగా తలమడుగు మండలం రుయ్యాడి


రుయ్యడి హసన్ హుస్సేన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ మంతి ఇంద్రకరణ్‌రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పీరీలకు ఘనమైన చరిత్ర ఉండటంతో మంగళవారం రాష్ట్ర గిడ్డంగుల శాఖ కమిషనర్ గోపిడి జితేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో మోహరం సందడి

నేరడిగొండ: మొహర్రం ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. మంగళవారం మండలంలోని బుగ్గారం(బి)కుంటాల, వెంకటాపూర్, వాగ్ధారి, తర్నం, కుమారి తేజాపూర్, వడూర్, వాంకిడి గ్రామాలలో ఏర్పాటు చేసిన పీరీలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు., రాత్రి వేళల్లో దప్పుచప్పుల్ల మధ్య నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

ఇంద్రవెల్లి: మొహర్రం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పీరీలను వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ గ్రామాల్లో నృత్యాలు చేశారు. అనంతరం పీరీలకు నైవేద్యం సమర్పించారు. మత సామరస్యానికి ప్రతీకైన పీరీల వేడుకలను కులమతాలకు అతీతంగా ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు అల్వా చుట్టూ తిరుగుతూ పాటలు పాడి సందడి చేశారు.

మావల: మండల కేంద్రంతో పాటు వాఘాపూర్, బట్టి సావర్గం గ్రామాల్లో పీరీల సందడి కొనసాగుతోంది. మంగళవారం భక్తులు పీరీలకు ప్రత్యేకపూజలు చేసి మలిదా నైవేద్యాన్ని శేల్లే బట్టలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కాందోర నిర్వహించి మేకలను సమర్పించుకున్నారు. యువకులు పెద్దవాళ్లు దప్పు చప్పుళ్ల మధ్య పీరీలను ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. రాత్రి యువకులు గుండం చుట్టూ నృత్యాలు చేయడంతో పాటు మారు వేషాలు వేస్తూ అలరించారు.


రుయ్యాడిలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కమిషనర్ జితేందర్‌రెడ్డి


బుగ్గారం(బి)లో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం


ఇంద్రవెల్లిలో పీరీల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం


హసన్ హుస్సేన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సురేందర్‌రావు

రుయ్యాడిలో పకడ్బందీ ఏర్పాట్లు

● అదనపు ఎస్పీ సురేందర్‌రావు

తలమడుగు, జూలై 16: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ప్రసిద్ధ సర్వమత పుణ్యక్షేత్రం రుయ్యాడి గ్రామంలో నిర్వహిస్తున్న మొహర్రం పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు చర్యలను పర్యవేక్షించడానికి అదనపు ఎస్పీ సురేందర్ రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సురేందర్‌రావు మాట్లాడుతూ రుయ్యాడి గ్రామంలో నిర్వహిస్తున్న మొహరం పండుగకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆలయంలో హసన్ హుస్సేన్‌లను దర్శించుకుని పూజలు చేశారు. ఇందులో రూరల్ సీఐ ఫణీధర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాటిచ్చి ఏడు నెలలు : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, జూలై 16: కేసీఆర్ ప్రభుత్వ మాయాంలో తీసుకొచ్చిన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాల లబ్దిదారులకు రూపాయలు రూ.లక్ష 116తో పాటు తులం బంగారం ఇవ్వాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడి హోదాకు సీఎం రేవంత్‌రెడ్డి మాటిచ్చిన విధంగా తులం బంగారం ఇవ్వాలన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తన నివాసంలో బోథ్ నియోజక వర్గంలోని ఆయా మండల పరిధిలో గల 123 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.25లక్షల 9వేల రూపాయల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొందానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో మాయమాటలు చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలులోకి రాలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, కన్వీనర్లు శివారెడ్డి, నారాయణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారాం, తొటవెంకటేష్,నాగయ్య, నాయకులు పండరి, జహీర్, సురేందర్, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఎండీ సద్దాం తదితరులు పాల్గొన్నారు.


సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

నేరడిగొండ, జూలై 16: రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీజేపీ నేరడిగొండ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ కోసం రైతులా కదా అని చూడాలని, రేషన్‌కార్డు చూడటమేంటని ప్రశ్నించారు. పాస్‌బుక్ ఉన్న ప్రతీ రైతులందరికీ రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వక పోవడం ప్రభుత్వం తప్పని అన్నారు. ప్రభుత్వ నిబంధనలతో సగం రైతులకు రుణమాఫీ అందదని చెప్పారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్త శుద్ధి లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, రాఘవులు, ప్రవీణ్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు, తదితరులున్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న

ఎత్తిపోతల కమిటీని రద్దు చేయండి

● మరమ్మతులు చేయకున్న చేసినట్లు తప్పుడు నివేదికలు
● రైతులు చెల్లించిన డబ్బులు సొంతానికి వినియోగం
● జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేసిన గడ్‌చందా రైతులు


జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

లోకేశ్వరం, జూలై 16 : ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టకున్న చేసినట్లు తప్పుడు నివేదికలు తయారు చేసి రైతుల నుండి వసూలు చేసిన డబ్బులను దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఎత్తిపోతల కమిటీని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా సహకార అధికారికి రైతులు ఫిర్యాదు చేశారు. లోకేశ్వరం మండలంలోని గడ్‌చందా సమీపంలో గల లక్ష్మీ నరసింహ ఎత్తిపోతల పథకం ఛైర్మన్, డైరెక్టర్లు ఇష్టారీతిన వ్యహరిస్తూ డబ్బులు దుర్వినియోం చేస్తున్నారని రైతులతో ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతుల నుండి వసూలు చేసిన డబ్బులు ఎత్తిపోతల పథకం కమిటీ బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్నారని పేర్కొన్నారు. వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తులను మెకానిక్‌లుగా నియమించుకొని మోటార్లు బాగానే పని చేస్తున్న వాటికి మరమ్మతులు చేసినట్లు తప్పుడు నివేదికలు తయారు చేస్తున్నారని ఇలాగైతే ఎత్తిపోతల నిర్వహణ భారంగా మారుతుందని, దీనితో మూతపడే ఆస్కారం ఉందని వెంటనే ఆ కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీ టీవీ ఆధారంగా చోరీకి గురైన ట్రాక్టర్ పట్టివేత

● 24 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన భైంసా పోలీసులు ● అభినందించిన నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల

భైంసా, జూలై 16 : పట్టణ పరిధిలోని మదీనాకాలనీలో ట్రాక్టర్ చోరీ ఘటన కేసును భైంసాటౌన్ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేధించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా చోరి గురైన ట్రాక్టర్‌ను స్వాధీనపరుచుకొని దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి మంగళవారం ఘటనకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఆదివారం రాత్రి పట్టణ పరిధిలోని మదీనా కాలనీలో మహమ్మద్ ఒమర్ చౌహాన్ అనే వ్యక్తి రోజు వారీలాగానే తన ట్రాక్టర్‌ను ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. సంబంధిత ట్రాక్టర్ అదే రోజు రాత్రి చోరీకి గురవ్వడంతో సోమవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ షరీఫ్, గౌస్‌లు దర్యాప్తు చేపట్టారు. పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లోని ఫుటేజీని నిశితంగా పరిశీలించి నిందితుడిని అదే రోజు బోకర్ క్రాస్ రోడ్డు వద్ద పట్టుకొని ట్రాక్టర్‌ను స్వాధీనపరుచుకున్నట్లుగా వివరించారు. ట్రాక్టర్ చోరీకి పాల్పడిన నిందితుడు నిఖిల్ రాజు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హత్గావ్ గ్రామ నివాసిగా గుర్తించినట్లుగా పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా పేర్కొన్నారు. 24 గంటల వ్యవధిలో ట్రాక్టర్ చోరి కేసును ఛేధించిన భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐలు షరిఫ్, గౌస్‌లను జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్‌లు అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న చోరీకి గురైన ట్రాక్టర్

అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసుల అందజేత

నర్సాపూర్(జి), జూలై 16 : మండలంలోని చాక్‌పల్లి గ్రామ వ్యవసాయ భూముల్లో గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఐట్ల సుదర్శన్‌కు మంగళవారం పంచాయతీ కార్యదర్శి నరేష్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ భూ యజమాని మూడు రోజుల్లో అనుమతులు పొందాలని తెలిపారు.గ్రామ పంచాయతీ నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆయన నోటీసులో పేర్కొన్నారు.


అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసుల అందజేత

వ్యవసాయ భూముల్లో రైస్‌మిల్ నిర్మిస్తే ఊరుకునేది లేదు

● నర్సాపూర్(జి) గ్రామరైతులు

రైస్‌మిల్ నిర్మించాలంటే కనీసం ఒక ఎకరం భూమిలో లైసెన్స్‌లు పొంది గ్రామ పంచాయతీ నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ పొందాలి. నిబంధనలు తుంగలో తొక్కి కేవలం పదహారు గుంటల్లో రైస్‌మిల్ నిర్మాణాలు చేపట్టి పక్క రైతు వ్యవసాయ భూమిలో రైతు అనుమతి లేకుండా విద్యుత్ అధికారులు స్తంబాలు ఏర్పాటు చేశారు.నిబంధనలు పాటించకుండా రెతుల భూముల్లో స్తంబాలు ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

● ఒకరు అక్కడిక్కడే మృతి, ఆరుగురికి గాయాలు

భిక్కనూరు, జూలై 16: శుభాకార్యానికి హాజరై తిరిగి తన కారులో స్వగ్రామానికి వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుకాల నుంచి ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జై ఒకరు తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతి చెందగా.. కారులో ఉన్న ఆరుగురికి గాయాలైన సంఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బ్రహ్మారౌత్ శివకుమార్ వర్మ(34) హైదరాబాద్‌లోని తన బావమరిది శ్రీకాంత్‌వర్మ ఇంట్లో జరిగిన శుభకార్యానికి తన భార్య రవళి, కుమారుడు శివానంద్, కూతురు ఆరాధ్య, స్నేహితులు కన్నుల అరుణ్(ముప్కాల్), మంతెన సాయిరెడ్డి(ముచ్చర్ల), బర్దవాల్ శివకుమార్(గోరటికల్)తో కలిసి హాజరై తిరిగి స్వగ్రామం నిర్మల్‌కు వస్తుండగా మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులోని సురేష్‌దాబా సమీపంలో ఆగిఉన్న లారీని వెనుకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు లారీ కిందికి సగ భాగం వరకు వెళ్లగా కారులో ఇరుక్కుపోయి తీవ్రగాయాలై శివకుమార్‌వర్మ అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మృతుడి భార్య రవళి, కుమారుడు శివనాంద్, కూతురు ఆరాధ్య, స్నేహితులు అరుణ్, సాయిరెడ్డి, శివకుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వీరిని కామారెడ్డికి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన వారిని పరీక్షించిన వైద్యులు తీవ్రంగా గాయపడిన శివకుమార్‌ను మెరుగైనా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. మృతుడి మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మృతి చెందిన నిర్మల్‌కు చెందిన శివకుమార్‌వర్మ


గాయపడిన వారిని 108 లో తరలిస్తున్న దృశ్యం


ప్రమాదంలో కారు లారీ కిందకి దూసుకెళ్లిన దృశ్యం

నుజ్జునుజ్జయిన కారు..

ఈ ప్రమాదంలో కారు లారీ కిందికి చాలా వరకు వెళ్లడంతో కారు సగ భాగానికి పైగా నుజ్జునుజ్జైంది. సమాచారం అందుకున్న పోలీసులు, జీఎంఆర్, 108 సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కారులో వెనుక భాగంలో ఉన్న వారిని అతికష్టం మీద బయటకు తీయగా మృతుడు శివకుమార్‌వర్మను చాలా సమయం వరకు బయటకు తీయడం సాధ్యం కాలేదు. దీంతో క్రేన్ సహాయంతో లారీ కింద ఇరుక్కుపోయిన కారును బయటకు తీసి కారులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు.

మొక్కలు నాటడమే కాదు.. సంరక్షించాలి


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

దిలావర్‌పూర్, జూలై 16 : మొక్కలు నాటి వదిలేయకుండా వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్ అన్నారు. మంగళవారం జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణలో మొక్కలే కీలకమన్నారు. నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి విద్యార్థి, అధ్యాపకులు తీసుకోవాలని సూచించారు. ప్రతి శనివారం కళాశాల ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే. శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్‌కుమార్, సీనియర్, అధ్యాపకురాలు విజయలక్ష్మి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు మూలాధారం

తానూర్, జూలై, 16 : మానవ మనుగడకు మొక్కలు మూలాధారమని ఏపీవో గంగాధర్ అన్నారు. మండలంలోని మహాలింగి గ్రామంలో మంగళవారం మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్క నాటి దానిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ దత్తాత్రి, గ్రామ కార్యదర్శి లక్ష్మణ్ ఉన్నారు.

అమ్మ మాట .. అంగన్‌వాడీ బాట ర్యాలీ

లక్ష్మణచాంద, జూలై 16 : మండలంలోని చామన్‌పెల్లి, మునిపెల్లి, పొట్టపెల్లి తదితర అన్ని గ్రామాల్లో 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రెండున్నర సంవత్సరాలలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పటం కోసం సామాజిక చైతన్యం చేశారు. పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అందించాలనే సంకల్పంతో నూతన తెలంగాణ ప్రభుత్వం 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గత సోమవారం నుండి ఈ నెల 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి రెండున్నర సంవత్సరాలలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకోనున్నారు. చివరి రోజైన శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. చిన్నారులందరికీ కూడా ప్రత్యేక యూనిఫాంను అందించనున్నట్లు తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించండి

నిర్మల్ కల్చరల్, జూలై 16 : మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ సావిత్రి కోరారు. మంగళవారం ఆదర్శనగర్ కేంద్రంలో బడిబాట నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. జ్యోతి, శైలజ, హేమలత, శ్యామల పాల్గొన్నారు.

కస్రలో 'అమ్మ మాట.. అంగన్వాడీ బాట'

కుభీర్, జూలై, 16 : మండలంలోని కస్ర గ్రామంలో మంగళవారం అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ తిప్ప అరుణ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడికి పంపాలన్నారు. అంగన్‌వాడీలో పోషకాహారం అందించడం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3 ၊ కనిష్ఠం 24.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 17 జూలై 2024







● ఇటీవల పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన గుట్కా నిల్వలు

గుట్టుగా.. గుట్కా దందా

- జిల్లాలో మత్తుపదార్థాలపై పూర్తిగా నిషేధం విధించిన ప్రభుత్వం
- అయినా.. గుట్టుచప్పుడుకాకుండా కొనసాగుతూనే ఉన్న గుట్కా దందా
- తరచూ పట్టుబడుతున్నా.. ఆగని మాఫియా ఆగడాలు
- సరిహద్దు చెక్‌పోస్టుల్లో కొరవడిన నిఘా
- రాత్రివేళల్లో మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతులు
- పోలీసులు మరింత కఠినంగా వ్యవహరిస్తేనే కట్టడి సాధ్యం
- గడిచిన నెలరోజుల్లో 61 కేసులు నమోదు కాగా.. 93 మంది అరెస్టు
- జిల్లావ్యాప్తంగా రూ.కోటీ 77లక్షల 16వేల 73 విలువైన గుట్కా స్వాధీనం





ఆదిలాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గుట్కా మత్తుపదార్థాలపై పూర్తిగా నిషేధం విధించడంతో వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా గుట్కా దందాను కొనసాగిస్తున్నారు. గత నెల రోజుల క్రితం నుంచి పోలీసులు గుట్కా నిల్వలపై ప్రత్యేకదృష్టిని సారించి స్వాధీనం చేసుకుంటున్న అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు. ఇంకా గుట్టల కొద్ది గుట్కా నిల్వలు పట్టుబడుతునే ఉన్నాయి. గడిచిన నెలరోజుల్లో పోలీసులు 61 కేసులు నమోదు చేయగా 93 మందిని అరెస్టు చేశారు. ఇందులో కోటీ 77లక్షల 16వేల 73 రూపాయల విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడుల్లో భారీ మొత్తంలో గుట్కా నిల్వలు పట్టుబడడం చూస్తుంటే ఈ దందా ఏస్థాయిలో కొనసాగుతుందో ఇట్టే తెలుస్తూనే ఉంది. ఆదిలాబాద్ పట్టణంతో పాటు ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బోథ్ మండలాల్లో భారీగా నిల్వ చేస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికీ అనుమానం రాకుండా జిల్లాకేంద్రం పరిసర ప్రాంతాల్లో ఉన్న గోదాంలు, మూతబడిన పత్తి పరిశ్రమలను అడ్డాగా చేసుకుని దందాను కొనసాగిస్తున్నారు. అంతలేకాకుండా కొందరైతే పంటచేలలో ఏర్పాటు చేసుకున్న ఫాంహౌజ్‌ల్లోనూ గుట్కను నిల్వ చేస్తూ రహస్యంగా తరలిస్తూ అమ్మేసుకుంటున్నారన్న టాక్ వినిపిస్తోంది. పోలీసులు దాడులు చేస్తూ గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకుంటున్న మళ్లీ యథావిధిగా దందా కొనసాగుతునే ఉన్నాయి. 'దొరికితే దొంగ లేకుంటే దొర' అన్న చందంగా జిల్లాలో గుట్కా వ్యాపారం కొనసాగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీ కేంద్రాల వద్ద నిఘా కరువు

జిల్లా సరిహద్దుల్లో ఉన్న తనిఖీ కేంద్రాల వద్ద నిఘా కరువవడంతోనే జిల్లాలోకి గుట్కా పదార్థాల సరఫరా జోరుగా సాగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సరిహద్దులు దాటి జిల్లాలోకి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేసి ఉంటే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అసలు ఆస్కారమే ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వ్యాపారులు తెలివిగా రాత్రికి రాత్రే మహారాష్ట్ర నుంచి పెన్‌గంగా మీదుగా జిల్లాలోకి గుట్కాను తరలిస్తు నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. కాసుల కోసం కక్కుర్తిపడి కొందరు చెక్‌పోస్టు అధికారులు కళ్లు మూసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో భారీగా దిగుమతి చేసుకుంటూ పగలంతా జిల్లా అంతటా సరఫరా చేస్తూ విక్రయాలు జరుపుతున్నారు. పకడ్బందీగా తనిఖీ చేస్తే జిల్లాలోకి ఎలాంటి గుట్కా పదార్థాలు దిగుమతి అయ్యే అవకాశం ఉండదు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న జైనథ్ మండలంలోని బోరజ్, తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్, బోథ్ మండలం ఘన్‌పూర్ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు లేకనే యథేచ్ఛగా గుట్కా రవాణా సాగుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా చెక్‌పోస్టు అధికారులు దీనిపై దృష్టి సారిస్తేనే అక్రమ దందాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. పోలీసుల దాడుల పేరిట వ్యాపారులు గుట్కాను అధిక ధరలకు అమ్మేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

సవాలుగా అక్రమ దందాలు





జిల్లాలో సాగుతున్న గుట్కా దందా పోలీసులకు సవాలుగా మారింది. గుట్కా నిల్వలను పట్టుకున్న కొద్ది.. మళ్లీ పట్టుబడడం చూస్తుంటే ఇన్నాళ్లు ఏ స్థాయిలో గుట్కా దందా సాగిందో తెలుస్తుంది. పోలీసులు దాడులు నిర్వహిస్తూ గుట్క పదార్థాలను స్వాధీనం చేసుకోవడం.. ఆపై ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి వదిలేయడం పరిపాటిగా మారింది. కానీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం మోపాల్సి ఉంది. అయితే పోలీసుల చర్యలకు రాజకీయ ఒత్తిళ్లు అడ్డు రావడంతో ఈ దందా పూర్తిస్థాయిలో అంతంకావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జర్దా, తంబాకు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంది. వాటి వల్ల పొంచి ఉన్న భయంకర వ్యాధుల గురించి ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజల్లో అవగాహన లేక పోవడంతోనే మత్తు పదార్థాల వినియోగానికి యువత బానిసై అలవాటుగా మార్చుకుంటున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొస్తేనే కొనుగోలు నిలిచిపోయి వ్యాపారుల అంచనాలను తలకిందులు చేసే అవకాశం ఉంటుంది. దాడులతో పాటు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విక్రయాలను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం

: జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్



జిల్లాలో మత్తుపదార్థాల విక్రయాలను పూర్తిగా కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసి కోట్ల రూపాయల విలువైన గుట్కాను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇతర రాష్ట్రాల్లో నిషేధం లేక పోవడంతో నియంత్రించడం కొంత ఇబ్బందికరంగా మారింది. త్వరలోనే ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం. అక్రమంగా గుట్కా, మత్తు పదార్థాలను విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

సంక్షిప్త సమాచారం



వివరాలు తెలుసుకుంటున్న మేనేజర్ వినయ్‌కుమార్

ఈ-సేవా ఆధార్ సెంటర్ తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, జూలై 16: జిల్లాకేంద్రంలోని ఈ-సేవా ఆధార్ సెంటర్‌ను రాష్ట్ర యూఐడీఏఐ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ వినయ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్, ఆన్‌లైన్ ప్రాసెస్‌ని క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. సిటిజెన్స్ సరైన డాక్యుమెంట్స్ ఆధార్ సెంటర్ వద్ద తీసుకు రావాల్సిందిగా సూచించారు. ఆయన వెంట కలెక్టర్ ఈడీఎం రవి బండి, ఈ-సేవ సెంటర్ మేనేజర్ జోగు సాగర్, ఆపరేటర్ స్వాగలు, తదితరలు ఉన్నారు.

కొత్తగూడెంకు బస్సు సౌకర్యం

● ఆర్టీసీ డీఎం కల్పన

ఆదిలాబాద్ అర్బన్, జూలై 16: కొత్తగూడెంకు బస్సుసౌకర్యం కల్పించాలని డీఎస్సీ అభ్యర్థుల విన్నపం మేరకు ఒక బస్సును ప్రత్యేకంగా వేశామని డీఎం కల్పన తెలిపారు. ప్రయాణికుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు ఈనెల 22న సాయంత్రం 7 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సును వేయనున్నారు. తిరుగు ప్రయాణం కోసం అక్కడి నుంచి 23న సాయంత్రం బస్సు బయలుదేరనుందని తెలిపారు. ఒక్కొక్కరి చార్జీ రూ.800 ఉంటుందని, ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే కొత్తగూడెం మినహా రెగ్యూలర్ సర్వీసుల్లో రానుపోను టికెట్లు తీసుకుంటే రిటర్న్ జర్నీలో పది శాతం రాయితీ ఉంటుందన్నారు. ఉట్నూర్ డిపో నుంచి ప్రయాణికుల సూచనల మేరకు హైదరాబాద్‌కు రెండు బస్సులను నడిపిస్తున్నామని, ఆర్టీసీ సేవలను ప్రయాణికులు, డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలకు దుస్తుల పంపిణీ

జైనథ్, జూలై 16: మండల కేంద్రంలోని స్థానిక ఐకేపీ కార్యాలయంలో మంగళవారం 27 అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు కుట్టుదుస్తులను ఐకేపీ ఏపీఎం భగవండ్లు వీవోఏలకు అందజేశారు. ఈ సందర్భంగా పై అంగన్‌వాడీ కేంద్రంలో గల 180 బాలురు 174 మంది బాలికలకు ఈ దుస్తులను అందజేశారు. సంబంధిత కుట్టు మిషన్ కేంద్రాల నిర్వాహకులు పిల్లలకు త్వరితగతిన అందించాలని సూచించారు. ఇందులో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ శృతి, వీవో అధ్యక్షులు, నిర్వాహకులు, సీసీలు పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన లబ్ధి చేకూర్చాలి'

ఉట్నూర్, జూలై 16: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా అర్హులైన వెనుకబడిన తరగతుల కులవృత్తుల వారికి వెంటనే ప్రయోజనం కల్పించాలని నాయిబ్రహ్మణ సంఘం ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు గర్మకుర్తి వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద 18 కులాలకు లబ్ధి చేకూరుస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇంత వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి ఎలాంటి ప్రయోజనం కలిగించ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఈ కార్యచరణ చేపట్టాలని కోరారు.

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

● పలు మండలాల్లో గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలు ● ఉట్నూర్‌లో 63.5 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదు కాగా.. మావలలో 1.3 మి.మీ. అత్యల్ప వర్షపాతం ● మరో రెండు, మూడు రోజుల పాటు జిల్లాకు వర్ష సూచన : వాతావరణ శాఖ నిపుణులు



పట్టణంలో కురుస్తున్న వర్షం

ఆదిలాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): గత రాత్రి నుంచిజిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 353.7 మి.మీ.లు కాగా 391.6 మి.మీ.ల వర్షపాతం కురిసింది. సాధారణ వర్షపాతమే నమోదైన ఆశించిన స్థాయిలో జలాశయాల్లోకి వరదనీరు వచ్చి చేరడం లేదు. మంగళవారం అత్యధికంగా ఉట్నూర్ మండలంలో 63.5 మి.మీ.లు, ఇంద్రవెల్లిలో 49.0 మి.మీ.లు, గాదిగూడలో 44.0, బేలలో 32.8 మి.మీ.ల వర్షపాతం కురిసింది. అత్యల్పంగా మావల మండలంలో 1.3 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మేఘావృతమై కనిపించింది. మధ్యాహ్నం సమయంలో ఇచ్చోడ, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఓ మోస్తారు స్థాయిలో వర్షం కురిసింది. దీంతో కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి. అలాగే చెరువులు, కుంటలు ప్రాజెక్టుల్లోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరింది. సాత్నాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 286.50మీటర్లు కాగా ప్రస్తుతం 281.70 మీర్లు నీటిమట్టం ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 260 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. మత్తడివాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 277.50 కాగా ప్రస్తుతం 275.600 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి 111 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. మరో రెండు మూడు రోజుల పాటు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

● ఇచ్చోడలో కుండపోత వర్షం

ఇచ్చోడ: మండలంలో మంగళవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. దాదాపు రెండు గంటల పాటు వర్షం కురవడంతో వరద పోటెత్తింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వరదనీరు భారీగా చేరడంతో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తంతా రోడ్లపై పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో నాలాలు పొంగిపోవడంతో రహదారులపై వరదనీరు ప్రవహించింది. మండలంలోని గుండివాగు గ్రామ సమీపంలో వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గాయిత్రి జలపాతానికి వెళ్లే దారులు మూసుకుపోయాయి.

భోథ్: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో అరగంట పాటు వర్షం కురవగా సోనాల, కౌఠా(బి)తో పాటు 10 గ్రామాలలో భారీవర్షం కురిసింది. గత 20రోజుల క్రితం కురిసిన వర్షానికి వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వర్షాలు కురవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



జిల్లాకేంద్రంలో జోరుగా కురుస్తున్న వర్షం



సోనాల బస్టాండ్‌లో కురుస్తున్న వర్షం



ఇచ్చోడలో కురిసిన భారీ వర్షానికి రహదారులపై నిలిచిన వర్షపునీరు

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన అవసరం



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

● జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

ఇచ్చోడ, జూలై, 16: విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన ఎంత ముఖ్యమో.. పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన అంతే అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత పాఠశాల సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించిన ఆమె పాఠశాల సిబ్బందితో, వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై విద్యార్థుల ఆరోగ్యంపై చర్చించారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, భోజన సమయంలో, చేతుల శుభ్రతపై ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో వరదనీరు ఆవరణలోనికి వస్తోందని, పిచ్చిమొక్కలతో దోమల బెడద తప్పడంలేదని పాఠశాల ప్రత్యేకాధిరిణి మల్లికా డీఈవోకు పలు సమస్యలను విన్నవించగా.. త్వరలోనే సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటానని పేర్కొన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులను సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సీఎం సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజార్షి షా

సీఎం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 16: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఆయా జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా పాల్గొన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమల తీరు, పలు అంశాలపై చర్చించారు.

మున్సిపల్ అవిశ్వాస తీర్మానానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

ఆదిలాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్‌రంజాని పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసుతో జిల్లా కలెక్టర్ తేదీని ఖరారు చేశారు. అయితే అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేయాలంటూ వైస్‌చైర్మన్ జహీర్‌రంజాని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పరిశీలించిన కోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. యథావిధిగా జిల్లా కలెక్టర్ నిర్ణయించిన గడువులోగానే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవచ్చునని సూచించింది. దీంతో మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు చుక్కెదురైంది. అవిశ్వాస తీర్మాణాన్ని వాయిదా వేయించి గట్టెక్కె ప్రయత్నం చేసిన అధికార పార్టీ కాంగ్రెస్‌కు ఇక అవిశ్వాసం తప్పనిసరిగా మారింది. దీంతో అవిశ్వాస తీర్మాణానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు.

'గిరిజన సంక్షేమ టీచర్ల పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలి'

ఉట్నూర్, జూలై 16: ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టనున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఎలాంటి ఒత్తిళ్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం భుజంగరావు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుపను కోరారు. మంగళవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం పీఓ క్యాంపు కార్యాలయంలో పీఓను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ అప్లయిలో కొంత మంది ఉపాధ్యాయుల పేర్లు రాకపోవంతో దరఖాస్తులకు ఆన్‌లైన్ తేదీని పొడగించాలని, పండిత్‌లైన తెలుగు, హిందీభాష, వ్యాయామ ఉపాధ్యాయులు పోస్టులను పదోన్నతితో భర్తీ చేయాలని పలు అంశాలను పేర్కొన్నారు. కాగా, గిరిజన సంక్షేమ డీడీతో మాట్లాడి, తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని పీవో స్పష్టం చేసినట్లు భుజంగరావ్ తెలిపారు. మిగతా విషయాలను ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని తెలిపినట్లు తెలిపారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకోల జ్ఞానేశ్వర్, పవర్ రవీందర్, జితేందర్, వికాస్, సంజయ్, జాదవ్ మంగల్‌సింగ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని పీఆర్టీయూ టీజీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్, నర్రనవీన్‌యాదవ్‌లు అన్నారు.మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ డీడీ టీడబ్ల్యు అధికారి దిలీప్‌కుమార్‌ని శాఖ తరఫున కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశా రు. ఉపాధ్యాయ ఆన్‌లైన్ దరఖాస్తులను పొడగించాలని 317 జీవో బదిలీ అయినవారి పాత స్థానాలను చూపిస్తూ పాయింట్స్ కేటాయించాలన్నారు. ఇందుకు డీడీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఇందులో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్‌ప్రకాష్, బాబుసింగ్, ప్రసాద్ తదితరులున్నారు.



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు